ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
1

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 4 మే 2025

ఆదిత్యాలయ ఈవోగా శోభారాణి బాధ్యతల స్వీకరణ

అరసవల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలోని ఆదిత్యాలయం ఈవోగా శోభారాణి శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఈవో వై.భద్రాజీ సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో శోభారాణి విధుల్లో చేరారు. ఈమె గతంలో విశాఖపట్నంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయం ఈవోగా పనిచేశారు. శనివారం అరసవల్లిలో బాధ్యతలు స్వీకరణ అనంతరం ఆదిత్యుడి ఆలయాన్ని, పరిసరాలను సిబ్బందితో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు. వైశాఖమాసం వేళ భక్తులు పెద్ద సంఖ్యలో ఆదివారం స్వామి దర్శనానికి రానుండడంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నవ్వండి.. నవ్వించండి


వెంట్రిలాక్విజమ్ బొమ్మతో మిమిక్రీ శ్రీనివాస్ (ఫైల్)

- హాస్యంతో ఆరోగ్యంగా ఉంటారు
- సమస్యల్ని దూరం చేస్తుంది
- రోజుకు కనీసం అరగంటైనా నవ్వాలి
- నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

శ్రీకాకుళం కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాంత్రిక జీవితంలో జనానికి మనసారా నవ్వుకునే తీరిక లేకుండా పోయింది. ఫలితంగా తీవ్రమైన మానసిక ఒత్తిడి, రక్తపోటు, ఇతరత్రా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మనస్ఫూర్తిగా నవ్వే వారి శరీరంలో సమతుల్యమైన మార్పులు చోటు చేసుకొని, రక్త ప్రసరణ జరిగి మంచి ఆరోగ్యానికి దోహద పడుతుంది. రోజుకు కనీసం 30 నిమిషాలైనా మనసారా నవ్వకపోతే అనారోగ్య సమస్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే నవ్వులో పాజిటివ్ భావాలతో పాటు హీలింగ్ ప్రక్రియ కూడా ఉంది. అందుకే నగరాల్లో ప్రత్యేకంగా లాఫింగ్ క్లబ్‌లు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. హాస్యం మన సమస్యల్ని దూరం చేస్తుంది. హాయిగా నిద్ర పట్టేందుకు ఉపకరిస్తుంది. నవ్వడం అనేది ఓ ఆరోగ్య సూత్రం. అందుకే మీరు కడుపుబ్బ నవ్వండి.. అందర్నీ నవ్వించండి. ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని హాస్య నటులు, మిమిక్రీ ఆర్టిస్టుల గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

15 దేశాల్లో ప్రదర్శనలు..

శ్రీకాకుళం నగరానికి చెందిన మిమిక్రీ శ్రీనివాస్ గురించి తెలియని వారుండరు. తన వద్ద ఉన్న వెంట్రిలాక్విజమ్ అనే బొమ్మ ద్వారా సుమారు 15 దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. వెంట్రిలాక్విజమ్ బొమ్మతో నాభి నుంచి శబ్దాన్ని ఉత్పన్నం చేసే ప్రక్రియ ద్వారా అనేక మందికి నవ్వించి ఆరోగ్యవంతుల్ని చేస్తున్నారు. ప్రశాంతత వాతావరణానికి నవ్వు అనేది ఒక ఆరోగ్య సూచిక అని ఆయన అభిప్రాయపడుతున్నారు. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడమే మిమిక్రీ గొప్పతనమని అంటున్నారు. ప్రతిరోజూ నగరాల్లో లాఫింగ్ థెరపీ ద్వారా మానసిక రోగులకు వైద్యం కొనసా గిస్తున్నారని తెలుపుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పదవీ విరమణ పొందినవారికి, మానసిక రోగులు, చిన్నారులకు ప్రత్యేకంగా (మిగతా 4వ పేజీలో..)


లాఫింగ్ క్లబ్ ద్వారా చిన్నారులకు మానసిక ఉల్లాసాన్ని కల్పిస్తున్న మిమిక్రీ కళాకారుడు నందికేశ్వరరావు

వెండి తెరపై సిక్కోలు నవ్వులు

- కామెడీ కింగ్ కొండవలస


కొండవలస లక్ష్మణరావు(ఫైల్)

ఎచ్చెర్ల, మే 3(ఆంధ్రజ్యోతి): వెండి తెరపై ఆయన కనిపిస్తే చాలు నవ్వులే నవ్వులు. తనదైన శైలిలో డైలాగ్‌లు చెబితే ఎలాంటి వారైనా నవ్వలేకుండా ఉండలేరు. ఆయనే కామెడీ కింగ్ కొండవలస లక్ష్మణరావు. సిక్కోలు నుంచి సినీ పరిశ్రమకు వెళ్లి.. ఒక దశలో వెలుగొందారు. ఆయన స్వస్థలం సరుబుజ్జిలి మండలం కొండవలస. 1946 ఆగస్టు 10న జన్మించారు. 'ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు' సినిమాతో తెరంగ్రేటం చేశారు. అందులో పొట్టి రాజు క్యారెక్టర్‌తో అందర్నీ మెప్పించారు. 'నేను ఒప్పుకోను.. అయితే ఓకే' అంటూ మొదటి సినిమాతోనే అందరితో శభాష్ అనిపించుకున్నారు. 200కు పైగా సినిమాల్లో నటించి హాస్యాన్ని పండించారు. ఎంకాం చదివిన ఆయన నటనలో, డైరెక్షన్‌లో డిప్లమో కూడా పూర్తిచేశారు. విశాఖపట్నంలోని పోర్టు ట్రస్ట్‌లో ఉద్యోగం చేస్తూనే, నాటకాలు వేసేవారు. 'సవతితల్లి' అనే నాటికలో కొండవలస ద్విపాత్రాభినయంతో తొలిసారిగా అలరించారు. వెయ్యికిపైగా నాటకాలను ప్రదర్శించి మంచి నటుడిగా గుర్తింపు పొందారు. ఇలా నాటకాలు వేస్తున్న క్రమంలో ద్రాక్షారామంలో కొండవలస నటించిన 'అల్లదే మా ఊరు' అనే నాటికను వీక్షించిన దర్శకుడు వంశీ 'ఔను వాళ్లిద్దరు ఇష్టపడ్డారు' అనే సినిమాలో కొండవలసకు ప్రాధాన్యం ఉన్న పొట్టిరాజు క్యారెక్టర్‌ను ఇచ్చి ప్రోత్సహించారు. తన సహజ ధోరణిలో కూడా వినూత్నంగా కొండవలసతో డైలాగులు చెప్పించిన వంశీ.. చివరి సినిమా వరకు దానినే కొనసాగించడం విశేషం. ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వంలో వచ్చిన 'ఎవడి గోల వాడిది' చిత్రంలో కొండవలస కామెడీ విలన్‌గా కన్పించారు. కబడ్డీ కబడ్డీలో కృష్ణారావు క్యారెక్టర్‌తో అందర్నీ నవ్వించారు ఆయన. సత్యం, పందెం, రాఖీ, ఆదివారం ఆడవాళ్లకు సెలవు, పెళ్లాంతో పనేంటి, శ్రీరామచంద్రుడు తదితర సినిమాల్లో బాగా పేరు తెచ్చుకున్నారు. 12 ఏళ్ల పాటు సినిమాల్లో ఖాళీ లేకుండా నటించిన ఆయన ఆఖరి సినిమా వాసవీ కన్యకాపరమేశ్వరి చరిత. 2015 నవంబరు 2 హైదరాబాద్‌లో ఆయన కన్నుమూశారు.

నేడు నీట్

- జిల్లాల్లో నాలుగు కేంద్రాల్లో పరీక్ష
- మూడంచెల భద్రత నడుమ నిర్వహణకు ఏర్పాట్లు



నరసన్నపేట, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాలుగు కేంద్రాల్లో ఆదివారం యూజీ నీట్ నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అనుమతిస్తారు. జిల్లాలోని ఎచ్చెర్లలో ఆర్‌జేయూకేటీ, గుజరాతీపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, పెద్దపాడు రోడ్డులోని కేంద్రీయ విద్యాలయాన్ని పరీక్షా కేంద్రాలుగా కేటాయించారు. మూడంచల భద్రత నడుం పరీక్షలను నిర్వహించనున్నారు. 'అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డు, గుర్తింపు పత్రం(ఆధార్‌కార్డు, పాన్‌కార్డు తదితరవి), పాస్‌ఫొటో పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లాలి. నిర్దేశిత సమయంలో చేరుకోవాలి. పరీక్షా కేంద్రంలోకి ఫోన్‌లు, క్యాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేదం. దుస్తుల కోడ్‌ను పాటించాలి. సమాధానాలను బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో మాత్రమే రాయాలి' అని నిర్వాహకులు సూచించారు.


మునిసిపల్ కార్యాలయం ఆవరణలో జింక

పట్టుకునేలోపే తప్పించుకుంది

- కొండల వైపు వెళ్లిపోయిన జింక

3లో

తిట్ల దండకం.. గందరగోళం

- తెలికిపెంట పంచాయతీ నిధులపై విచారణలో ఇరువర్గాల ఘర్షణ
- వెనుదిరిగిన అధికారులు

3లో

ఆకట్టుకున్న బీచ్ ఫెస్టివల్

- ప్రత్యేక ఆకర్షణగా వాటర్ స్పోర్ట్స్


బీచ్ ఫెస్టివల్‌ను తిలకిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, విప్ అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు


ప్రత్యేక ఆకర్షణగా స్పీడ్ బోట్

సోంపేట, మే 3(ఆంధ్రజ్యోతి): బారువ సముద్ర తీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బారువ బీచ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. తొలిరోజు శనివారం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి విడిచిపెట్టడంతో ప్రారంభమైన కార్యక్రమాలు సాయంత్రం వరకు కొనసాగాయి. ముఖ్యంగా వాటర్ స్పోర్ట్స్ ఆహూతులను విశేషంగా అలరించింది. సైకతశిల్పం ఆకట్టుకుంది. రాజమండ్రి పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన కయాకింగ్ క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీపడ్డారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్లు పర్యవేక్షించారు. పిల్లల కోసం ఏర్పాటు చేసిన కిడ్స్‌పార్క్ ఆక ట్టుకుంది. బారువ తీరంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన స్పీడ్ బోట్స్ పర్యాటకులను ఆకర్షించాయి. అధికారులు ట్రయల్ రన్ వేసిన తరువాత వీటిని ఎక్కేందుకు పర్యాటకులు ఆసక్తి చూపించారు. ఇసుక తిన్నెలపై ఏర్పాటు చేసిన ఫుడ్ కౌంటర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మెరైన్, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటిరోజు కార్యక్రమాలు విజయవంతంగా జరగడంతో రెండోరోజైన ఆదివారం మరింత మంది పర్యాటకులు వస్తారని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు.



ఆకట్టుకున్న సైకత శిల్పం

మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయం

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- ఉప్పుటేరు, కొండిరేవు వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన

సోంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార గ్రామాల అభివృద్ధే ధ్యేయం గా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని కేంద్ర పౌరవిమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. సోంపేట మండలంలో మత్స్యకారులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కొండిరేవు, ఉప్పుటేరు వంతెనల నిర్మాణాకి.. ప్రభుత్వవిప్ బెందాళం అశోక్‌తో కలిసి శనివారం కేంద్రమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రూ.18.10కోట్ల వ్యయంతో బారువ వద్ద మహేంద్రతనయ నదిపై కొండిరేవు వంతెన, ఎకువూరు ప్రాంతంలో ఉప్పుటేరు వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం బారువ సముద్ర తీరంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బీచ్‌ఫెస్టివల్ కార్యక్రమంలో స్టాల్స్ పరిశీలించారు. తీరంలో పలు కార్యక్రమాలను, స్పీడ్ బోట్ గేమ్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మానా అహ్మద్‌ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్, ఆర్డీవోలు, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మడ్డుకుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

రీసర్వే తెచ్చిన తంటా

- తాడివలసలో మ్యుటేషన్లకు నోచుకోని 1,400 ఎకరాలు
- జాయింట్ ఎల్‌పీ నంబర్లతో రైతులకు ఇబ్బందులు

పొందూరు, మే 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చేపట్టిన భూముల రీసర్వేతో రైతులకు కొత్త ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రీసర్వే చేపడుతున్నట్టు వైసీపీ గొప్పలు చెప్పుకుంది. కానీ అధికారుల నిర్లక్ష్యమో, రీసర్వేలో లోపమో తెలియదు కానీ.. పొందూరు మండలం తాడివలసలో మ్యుటేషన్లు జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి సచివాలయానికి, తహసీల్దార్ కార్యాలయానికి తిరుగుతూనే ఉన్నా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడివలస రెవెన్యూ గ్రామపరిధిలో తాడివలసతోపాటు లచ్చయ్యపేట, గండ్రేడు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో 2,500 మంది రైతులు 1,400 ఎకరాలు సాగు చేస్తున్నారు. రీసర్వే ముందు రైతులకు పట్టా, పాసుపుస్తకాల్లో ఉన్నవిధంగా మ్యుటేషన్లు జరిగేవి. 1-బీ, అడంగళ్లు సైతం వచ్చేవి. దీంతో క్రయవిక్రయాలు సజావుగా జరిగేవి. రీసర్వే తర్వాత (మిగతా 4వ పేజీలో..)

ఎన్నిసార్లు తిరిగినా.. అంతే

రీసర్వే చేపట్టి.. ఏడాదైనా మా భూములకు మోక్షంలేదు. పాత సర్వేనంబర్లు ప్రకారం మ్యుటేషన్లు జరగడంలేదు. దీంతో వివిధ సర్వేనంబర్లలో నాకు 9 ఎకరాలు ఉన్నా 1-బీ, అడంగళ్ రావడంలేదు. తహసీల్దార్ కార్యాలయానికి ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం కనిపించడం లేదు. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలి.

\- సీపాన విష్ణువర్ధనరావు, రైతు, తాడివలస





తాడివలస సచివాలయం

పరిష్కారం మాచేతిలో లేదు

తాడివలసలో భూ సమస్యలు ఉన్న విషయం వాస్తవమే. ఈ సమస్య పరిష్కారం మా చేతిలో లేదు. గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులోను ఈ సమస్యపైనే వినతులు వచ్చాయి. సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

\- ఆర్.వెంకటేష్, తహసీల్దార్, పొందూరు





'చిలుక' పచ్చచెట్టు

అరసవల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): వేసవి వేళ చాలా చెట్లు ఆకులు రాలి మోడువారి పోతుంటాయి. కానీ శ్రీకాకుళంలోని గాంధీపార్కులో ఓ మహావృక్షం ఆకులు రాలిపోయినా సరే 'పచ్చదనం' మాత్రం కోల్పోలేదు. ఈ వృక్షంపై వందలాది రామచిలుకలు చేరి.. పచ్చదనంతో నింపేశాయి. కొమ్మ కొమ్మకూ, రెమ్మరెమ్మకూ చిలుకలు చిగురించాయా.. అన్న రీతిలో కనువిందు చేశాయి.







37 మంది హీరోలతో సినిమాలు తీసి అత్యధిక హిట్స్ ఇచ్చిన ఏకైక దర్శకుడు ఆయన ఒక్కరే. అలాగే 77 మంది హీరోయిన్లతో చిత్రాలు తీసిన ఘనత ఇండియాలో రాఘవేంద్రరావుకు మాత్రమే సొంతం.

నేను రుణపడేది ఆయనకే!

తెలుగు సినిమాకు మాస్ హంగులు అద్ది, బాక్సాఫీసును షేక్ చేసిన దర్శకుడు... తెలుగు పాటను రంగులతో అభిషేకించి, సంగీతంతో సంబరాలు చేయించిన సంగీతాభిమాని. హిట్స్, రికార్డ్ బ్రేక్ కలెక్షన్లు, సిల్వర్ జూబ్లీలు, పొగడ్తలు... ఇలా అన్నీ కట్టకట్టుకువచ్చి మీదపడినా.. అన్నిటినీ చిరునవ్వుతో స్వీకరించడం తప్ప, స్టేజ్ మీద కానీ, మరెక్కడైనా కాని అహంకారంతో ఎప్పుడూ ఆయన మాట్లాడలేదు... 'గ్లామర్, గుట్టల గుట్టల పండ్లు, నాయికల నాభి తప్ప... అంతకంటే ఏం తియ్యగలడు' అనే వాళ్లకు 'అన్నమయ్య' అనే అద్భుతాన్ని అందించి తన ప్రతిభను పండించుకున్న ఆ దర్శకుడు... కె. రాఘవేంద్రరావు. యాభై ఏళ్ల కెరీర్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆ దర్శకేంద్రుడు తన సినీ పయనంలో ఎదురైన ఆసక్తికరమైన సంఘటనలను, విశేషాలను 'నవ్య'కు వివరించారిలా...



మీరందరూ యాభై ఏళ్లు అయిందని చెబుతుంటే ఆనందంగా ఉంది. నిజం చెప్పాలంటే 'పరిశ్రమలోకి వచ్చి ఇన్నేళ్లు అయింది, ఇన్ని సినిమాలు చేశాను' అని నేను ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు. నా పని నేను చేశాను. 'వెయ్యి కోట్ల రూపాయలు కావాలా, డైరెక్షన్ ఛాన్స్ కావాలా?' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే... ఇప్పటికీ దర్శకత్వాన్నే కోరుకుంటా. డైరెక్షన్ అంటే నాకు అంత పిచ్చి. ఇన్నేళ్ల నా కెరీర్‌లో ఒకే ఒక వ్యక్తికి రుణపడి ఉంటాను. ఆయనే ఎన్టీఆర్. 'పాండవ వనవాసం' చిత్రంతో పరిశ్రమలోకి ప్రవేశించి, రామారావుగారి మీద తొలి క్లాప్ ఇచ్చాను. అలాగే ఆయన నటించిన 'అడవిరాముడు' సినిమా నుంచే అగ్ర దర్శకుడిగా ఎదిగాను. ఆ రోజు రామారావుగారి మీద క్లాప్ ఇచ్చిన తర్వాత ప్రేక్షకులు ఇన్నేళ్లుగా నా సినిమాలు చూస్తూ ఇన్ని క్లాప్స్ కొడతారని ఊహించలేదు. సినిమా పాటకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేసిన సినిమా 'అడవిరాముడు'. రామారావుగారు నడిచి వస్తుంటే ఆ రోజుల్లో జనం పూలు జల్లేవారు, హారతులు ఇచ్చేవారు. 'ఆయన నడిచి వస్తేనే ఇలా చేస్తున్నారు, ఏనుగు ఎక్కిస్తే ఇంకెంత ఆనందిస్తారో?' అని అడవిరాముడు తీశాను. ఆ సినిమాలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాట చూసి జనం డబ్బులు విసరడం మొదలుపెట్టారు. అప్పటినుంచి మా కాంబినేషన్‌కు క్రేజ్ మొదలైంది. అలాగే నిర్మాతలు లేకపోతే నేను లేను. ఈ యాభై ఏళ్ల జర్నీ ఇంత విజయవంతంగా సాగడానికి నా నిర్మాతలే కారణం. నాతో పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు, పంపిణీదారులకు, థియేటర్ యజమానులకు, నన్ను ఆదరించిన ప్రేక్షకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

• హీరో కావాలని అనుకోలేదు

నాకు సినిమాలు అంటే చాలా చాలా ఇష్టం. పుస్తకాలు కొనుక్కోమని ఇంట్లో డబ్బులు ఇస్తే అవి కొనకుండా సినిమాలకు వెళ్లి, స్నేహితుల పుస్తకాలు చదివిన రోజులు ఉన్నాయి. దాదాపు ప్రతి రోజూ సినిమా చూసిన సందర్భాలు ఉన్నాయి. నాకు మొదటి నుంచీ నటన మీద ఆసక్తి లేదు. దర్శకుడినవ్వాలనేదే నా కోరిక. నటుడినో, హీరోనో కావాలని ఎప్పుడూ అనుకోలేదు.

• లక్ష రూపాయలతో తొలి సినిమా అనుకున్నా

ఎన్టీఆర్, కృష్ణ తొలిసారిగా కలసి నటించిన 'స్త్రీ జన్మ' చిత్రానికి నాన్నగారు దర్శకుడు. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌ని. సెట్‌లో నా ఇన్‌వాల్వ్‌మెంట్, పనితీరు గమనించిన ఆ చిత్ర నిర్మాత రామానాయుడు గారు "రాఘవేంద్రరావ్.. నీ ఫస్ట్ పిక్చర్ నాకే చెయ్యాలి" అనేవారు. "ఇప్పుడు కాదు.. తర్వాత చూద్దాంలే" అన్నారు నాన్నగారు. ఆ తర్వాత నా ఫ్రెండ్స్ ఏవీఎం సీజర్, అడుసుమిల్లి కుమార్, గోపాలకృష్ణ కలసి నా దర్శకత్వంలో సినిమా తీద్దామని వచ్చారు. "ఎవరూ చేయని విధంగా సినిమా తీద్దాం. పల్లెటూరికి వెళ్దాం. లక్ష రూపాయల బడ్జెట్‌లో తీద్దాం" అన్నాను. "లేదు లేదు భారీ బడ్జెట్‌లో తీద్దాం" అన్నారు వాళ్లు. 'బాబు' సినిమాకు మా నాన్న కథ ఇచ్చారు. శోభన్‌బాబు హీరో. ముగ్గురు హీరోయిన్లు. చాలా భారీగా తీశాం. నాకు తొలి అవకాశం ఇచ్చిన ఆ ముగ్గురు మిత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు. సినిమాకు మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. అయితే మా సినిమా విడుదలైన కొన్ని రోజులకు విశ్వనాథ్‌గారి 'జీవనజ్యోతి' రిలీజ్ అయింది. ఆ చిత్రం చూడగానే నా సినిమా భవిష్యత్ అర్థమై పోయింది. ఊహించినట్లుగానే 'జీవనజ్యోతి' వచ్చాక మా సినిమా వసూళ్లు తగ్గాయి.

• మూడు తరాల హీరోలతో...

నేను నిర్మాతల దర్శకుణ్ణి. ఎక్కువ రోజులు షూటింగ్ చేసి నిర్మాతను ఇబ్బంది పెట్టలేదు. అందుకే ఒక్కో నిర్మాతకు చాలా సినిమాలు చేసే అవకాశం కలిగింది. నా అదృష్టం ఏమిటంటే.. నా దర్శకత్వంలో నటించడానికి ఏ హీరోకానీ, నటుడు కానీ 'నో' అనలేదు. మూడు తరాల హీరోలతో పని చేశాను. అందరికీ గుర్తుండిపోయే హిట్స్ ఇచ్చే అవకాశం దక్కడం నా అదృష్టం.

• ఆ టెన్షన్ ఉండేది

రామారావుగారు ఒక సినిమా కోసం దాదాపు 40 రోజుల పాటు ఔట్‌డోర్‌లో ఉండడం అన్నది 'అడవిరాముడు'తోనే మొదలు. అంతవరకూ ఆయనకు ఔట్‌డోర్ అంటే మద్రాసు గిండీ ఫారెస్టే. అటువంటి వ్యక్తి ఈ చిత్రకథ నచ్చి అన్ని రోజులు ఔట్‌డోర్‌లో ఉండిపోయారు. మధ్యలో ఒకటి రెండు సార్లు 'దానవీరశూర కర్ణ' చిత్రం రీరికార్డింగ్ కోసం మద్రాసు వెళ్లి వచ్చారేమో! 'ఈ సినిమా ఆడకపోతే నా కెరీర్ ఏమవుతుందా?' అనే టెన్షన్ 'అడవిరాముడు' చేస్తున్నప్పుడు నాకు ఉండేది. చిన్న సినిమాలు చేసుకోవచ్చు కానీ రామారావుగారు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్టుదలతో పని చేశాను. రామారావుగారు షూటింగ్ ముగించుకుని వెళ్లిపోతూ "నా కెరీర్‌లో ఇది మధుర జ్ఞాపకం' అని మెచ్చుకోవడం మరిచిపోలేని సంఘటన. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు కూడా నా హీరోలు ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్... ఎవరూ నిరుత్సాహపరిచేలా మాట్లాడలేదు. నాకు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. అది వారి గొప్పతనం. ముఖ్యంగా రామారావుగారు. ఆయనకు 'సింహబలుడు', 'తిరుగులేని మనిషి' అని రెండు ఫ్లాప్స్ ఇచ్చాను. ఆయన వద్దు అనుకుంటే నాకు మరో అవకాశం వచ్చేది కాదు.. కానీ ఆయన గొప్పతనం ఏమిటంటే.. "ఇట్సాల్ రైట్ బ్రదర్.. ఏం తీయకూడదో నేర్చుకున్నాం. ఈ సారి మంచి కథతో ప్లాన్ చేయండి..' అన్నారు., ఆయన ఆఖరి చిత్రం 'మేజర్ చంద్రకాంత్' చేసే అవకాశం నాకు దక్కడం నా అదృష్టం. అందుకే ఏ ఫంక్షన్‌కు వెళ్లినా "రామారావుగారి వల్లే నేను ఈ స్థాయిలో ఉన్నాను" అని చెబుతుంటాను.

• సోషల్ మీడియాను కంట్రోల్ చెయ్యాలి

సోషల్ మీడియాను కంట్రోల్ చేసే పరిస్థితి రావాలి. ముఖ్యంగా కొన్ని యూ ట్యూబ్ ఛానల్స్ పెట్టే హెడ్డింగ్స్ ఇబ్బందికరంగా ఉంటున్నాయి. వాటిని అదుపు చేయాలి. ఈ విషయంలో నేను కూడా ఓసారి ఇబ్బంది ఎదుర్కొన్నా. అయితే వాటిని నేను పట్టించుకోను కనుక రియాక్ట్ కాలేదు. కానీ రాను రాను విచ్చలవిడితనం పెరిగిపోతోంది.

• పాటలో మొత్తం రామాయణం

నా కెరీర్‌లో అన్ని రకాల చిత్రాలూ చేశాను. 'అన్నమయ్య', 'శ్రీరామదాసు', 'పాండురంగడు'. 'మంజునాథ' 'శిరిడి', 'నమో వేంకటేశ' లాంటి సినిమాలు చేశాను. ఇప్పుడు ఓ పాటలో మొత్తం రామాయణాన్ని చూపించాలని నా కోరిక . దానికి సంబంధించిన టెస్ట్ షూట్ కూడా చేశా. అలాగే 'వల్లీ కల్యాణం' కూడా సినిమాగా తీయాలనే ఆలోచన ఉంది.

• వినాయకరావు

ఇప్పుడు తీరికే లేదు



'పెళ్లిసందడి' చిత్రం మళ్లీ తీసిన తర్వాత ఏం చేయాలా అని నాకు తోచలేదు. ఇన్ని సంవత్సరాలు వర్క్ చేసిన తర్వాత న్యాయంగా అయితే రిటైర్ అవ్వాలి, కానీ నాకు పని లేకపోతే తోచదు. అప్పుడు బాగా ఆలోచించి యూ ట్యూబ్ ఛానల్ స్టార్ట్ చేశా. షార్ట్ ఫిల్మ్స్ తీసి అప్‌లోడ్ చేస్తున్నా. పిల్లలకు సంబంధించి రెండేసి నిముషాల షార్ట్ ఫిల్మ్స్ ఏ.ఐ.లో తీస్తున్నాం. దానికోసం తీరిక లేకుండా వర్క్ చేస్తున్నా. కీ బోర్డ్ నేర్చుకుంటున్నా. అలాగే 'కెఆర్‌ఆర్ క్లాస్‌రూమ్' పేరుతో సినిమాల గురించి ప్రాక్టికల్ నాలెడ్జిని ఔత్సాహికులకు ఉచితంగా చెబుతున్నా.

28 రోజుల్లో 'జ్యోతి'



ఒక పెద్ద సినిమా తీసిన వెంటనే ఓ చిన్న చిత్రం తీయడం చాలా మంచిది. ఆ పద్ధతిని చాలా రోజులు కొనసాగించా. ప్రేక్షకులు అంచనాలు పెంచుకునే అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే 'ఏం తీస్తాడు, ఎలా తీస్తాడు...' అని వారంతా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. అందుకే రెండో సినిమా 'జ్యోతి'ని ప్రయోగాత్మకంగా 28 రోజుల్లో తీశాను. మురళీమోహన్, జయసుధ జంటగా నటించారు. ఆ సినిమా మంచి విజయం సాధించింది. మురళీమోహన్‌తో చేసిన 'కల్పన' చిత్రం విడుదల అయిన వారం రోజులకు 'అడవిరాముడు' వచ్చింది. ఈ రెండు సినిమాలూ హిట్ అయ్యాయి. అలాగే 'సింహబలుడు' చిత్రం భారీ బడ్జెట్‌తో తయారైతే, ఆ సమయంలోనే 'పదహారేళ్ల వయసు' చిత్రం లోబడ్జెట్‌తో వచ్చింది.

ముగ్గురు హీరోలతో 'త్రివేణి సంగమం'



నా నూరవ సినిమాను మొదట చాలా విభిన్నంగా ప్లాన్ చేశాను. చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్‌లతో ఆ సినిమా చేయాలని అనుకొని వారిని అడిగాను. ముగ్గురూ ఒప్పుకొన్నారు. 'త్రివేణి సంగమం' అని టైటిల్ అనుకున్నా. ఈ సినిమాను అరవింద్, అశ్వనీదత్‌లతో కలసి తీయాలిన ప్లాన్ చేశా. అయితే పాటల విషయంలో అభిమానుల మధ్య అభిప్రాయ బేధాలు వస్తాయేమో అనే అనుమానం వచ్చి ఆ ప్రాజెక్ట్ ఆపేశాం. అప్పుడు ఓ కొత్త హీరోతో చిన్న సినిమా తీద్దామని అల్లు అర్జున్‌ను పరిచయం చేస్తూ 'గంగోత్రి' తీశాం.

మరచిపోలేని మూడు సంఘటనలు



యాభై ఏళ్ల కెరీర్‌లో మరచిపోలేని మధుర సంఘటనలు మూడు ఉన్నాయి. 'అడవిరాముడు' చిత్రంతోనే పాటలు వచ్చినప్పుడు తెరపైకి డబ్బులు విసరడం అనే ట్రెండ్ మొదలైంది. అలాగే 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' చిత్రం పెద్ద తుపాన్ వచ్చిన సమయంలో విడుదల అయింది. చాలా థియేటర్లలో షోలు పడని పరిస్థితి. కానీ ఒక థియేటర్‌లో మాత్రం వర్షపు నీటిని మోటార్లు పెట్టి బయటకు తోడేస్తుంటే, జనం కుర్చీలో కాళ్లు పెట్టుకుని ఆ సినిమా చూశారు. 'అన్నమయ్య' చిత్రంలో 'మోకాళ్ల పర్వతాన్ని చెప్పులు వేసుకుని ఎక్కకూడదు' అని భానుప్రియ నాగార్జునకు చెప్పే సీన్ వచ్చినప్పుడు థియేటర్‌లో ప్రేక్షకులు కూడా చెప్పులు విడిచిపెట్టి సినిమా చూశారు.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీలో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్	THE DIPLOMAT	
ది డిప్లొమాట్	హిందీ చిత్రం	మే 09
గుడ్ బ్యాడ్ అగ్లీ	తమిళ చిత్రం	మే 08
ది రాయల్స్	హిందీ సిరీస్	మే 09
అమెజాన్ ప్రైమ్	Royals	
గ్రామ్ చికిత్సాలయ్	హిందీ చిత్రం	మే 09
జియో హాట్‌స్టార్		
స్టార్‌వార్స్	యానిమేషన్ సిరీస్	మే 04

వినోదాత్మక చికిత్స

ఓ మారుమూల పల్లెలో ప్రభుత్వ ఆస్పత్రి నేపథ్యంలో తెరకెక్కిన హిందీ సిరీస్ 'గ్రామ్ చికిత్సాలయ్'. అక్కడి వసతుల లేమి, వైద్యుల నిర్లక్ష్యంతో అమాయక గ్రామీణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తూ వారి చేతుల్లో దోపిడీకి గురవుతుంటారు. ఈ పరిస్థితుల్లో బదిలీపై ఆ గ్రామానికి వచ్చిన ప్రతిభావంతుడైన యువ వైద్యుడు ప్రభాత్ ఆ పరిస్థితులను మార్చాలని కంకణం కట్టుకుంటాడు. ఆ నేపథ్యంలో అతనికి ఎదురైన సవాళ్లు ఏమిటి, ప్రజలు అతనికి సహకరించారా అనేది వినోదాత్మకంగా ఈ సిరీస్‌లో ఆవిష్కరించారు. అమోల్ పరాశర్ వినయ్ పాఠక్, ఆకాంక్ష రంజన్ కీలకపాత్రలు పోషించారు. రాహుల్ పాండే దర్శకుడు.




బియ్యం నీళ్లు చేసే అద్భుతం..!

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ... శిరోజాలు రాలడం, అవి నిర్జీవంగా మారడం, వాటి చివర్లు చిట్లడం, చుండ్రు లాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నివారించేందుకు బియ్యం నీళ్లు అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఇలా తయారు చేసుకోవాలి...

- ఒక గిన్నెలో ఒక కప్పు బియ్యాన్ని తీసుకుని శుభ్రంగా కడగాలి. వెంటనే రెండు కప్పుల నీళ్లు పోసి అరగంటసేపు నానబెట్టాలి. తరవాత ఈ నీటిని మరో గిన్నెలోకి వడకట్టాలి.
- బియ్యాన్ని నీటిలో రెండు రోజులు నానబెడితే ఆ నీటిని 'ఫెర్మెంటెడ్ వాటర్' అంటారు. ఈ నీళ్లు మాడుకు, శిరోజాలకు అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. ఫెర్మెంటెడ్ వాటర్‌ను ఫ్రిజ్‌లో వారంపాటు నిల్వ చేసుకోవచ్చు.



- బియ్యం నీటిలో లావెండర్ లేదా రోజ్‌మేరీ ఆయిల్ చుక్కలు వేసుకుంటే ఫలితం బాగుంటుంది.
- బియ్యం నీళ్లలో బి, ఇ విటమిన్లతోపాటు మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.

ఇలా వాడాలి...

- ముందుగా శిరోజాలను కుంకుళ్లు లేదా గాఢత తక్కువగా ఉన్న షాంపూతో శుభ్రం చేసుకోవాలి. తలను కొద్దిగా ఆరనివ్వాలి. తరవాత బియ్యం నీటిని చేత్తో తీసుకుంటూ కురులకు, మాడుకు పట్టించాలి. బియ్యం నీటిని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి తలంతా చిలకరించుకోవచ్చు. అయిదు నిమిషాల తరవాత తలను వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. పావుగంటసేపు ఆరనిచ్చి మంచినీళ్లతో తలను శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.

విమానం ఎక్కేముందు...

విమానం ఎక్కేముందు కొన్ని రకాల ఆహార పదార్థాలు తినకపోవడమే మంచిదనీ లేదంటే ప్రయాణంలో అనారోగ్య సమస్యలు తప్పవనీ నిపుణులు చెబుతున్నారు.

- సాధారణంగా అల్పాహారం కింద బ్రోకలీ, క్యాబేజీ తురుము, వెనిగర్ వేసి తయారు చేసిన సలాడ్స్ తీసుకుంటూ ఉంటారు. వీటివల్ల గ్యాస్ చేరి కడుపు ఉబ్బరిస్తుంది. ఉదయం వేళ విమాన ప్రయాణం చేయాల్సి ఉంటే వీటిని తినకపోవడమే మంచిది.
- విమానం ఎక్కడానికి ఒక రోజు ముందు నుంచి బీన్స్, పప్పు దినుసులు తినకూడదు. ఇవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి విమానం ఎక్కగానే కడుపులో సమస్యలు ఏర్పడవచ్చు.
- నూనె పదార్థాలు, వేపుళ్లు, చిప్స్, వీధుల్లో అమ్మే పదార్థాలు తినకూడదు. వీటివల్ల కడుపులో వికారం, వాంతులు, తలనొప్పి లాంటి ఆరోగ్య సమస్యలు రావచ్చు.
- విమానం ఎక్కడానికి గంట ముందు నుంచి కార్బొనేటెడ్ డ్రింక్స్, ఆల్కహాల్ తీసుకోకూడదు. వీటివల్ల కడుపులో తిప్పడం, తల తిరగడం, తేన్పులు, కడుపు ఉబ్బరించడం లాంటివి ఏర్పడవచ్చు. సరిగా నిద్ర పట్టక అలసటగా అనిపిస్తుంది.
- కొంతమందికి చూయింగ్ గమ్ నమలడం, క్యాండీస్ తినడం అలవాటుగా ఉంటుంది. వీటివల్ల కూడా సమస్యలు ఏర్పడవచ్చు.
- విమానం ఎక్కేముందు కారంగా ఉన్నవి, మసాలాలు చేర్చిన ఆహార పదార్థాలు తినకూడదు. వీటి వల్ల గుండెలో మంటగా అనిపిస్తుంది.



అద్భుతమైన మహిళల కోసం

నూట తొంభై ఐదు దేశాలు... పది లక్షలమంది మహిళలు... వారి జీవన స్థితిగతులు... 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' పేరుతో మహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు... విశాఖకు చెందిన భరద్వాజ్ దయాల. వివిధ దేశాల్లో విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళల జీవితాలను ప్రతిబింబిస్తూ ఒక డాక్యుమెంటరీ రూపొందిస్తున్నారు. ఏడాదిన్నరలో బైక్‌పై ఐదు ఖండాలు, 16 దేశాలు చుట్టివచ్చిన ఆయన... 'నవ్య'తో ఆ విశేషాలు పంచుకున్నారు.



సంపాదించింది అంతా...

ఉద్యోగానికి రాజీనామా చేసి ఈ ప్రాజెక్ట్ ప్రారంభించాను. దీని కోసం ఇప్పటివరకూ నేను సంపాదించింది అంతా ఖర్చు చేస్తున్నాను. దీనిలో భాగంగా నా కారును ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నాను.

"సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. భారీ జీతం. కానీ జీవితమంటే సంపాదన మాత్రమే కాదని కొన్నేళ్ల ఉద్యోగ జీవితం తరువాత అనిపించింది. దానికితోడు కొత్తగా ఏదైనా చేయాలన్న తపన నన్ను కుదురుగా కూర్చోనివ్వలేదు. దాంతో 2006లో బైక్‌పై ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాను.

ఐదు ఖండాల్లోని 16 దేశాల మీదుగా 48 వేల కిలోమీటర్లు ప్రయాణించాను. ఏడాదిన్నరపాటు సాగింది ఈ యాత్ర. బైక్‌పై ప్రపంచ యాత్ర పూర్తి చేసిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాను. ఆ యాత్ర విశాఖలో ప్రారంభమై... ఇరాన్, టర్కీ, సిరియా, జోర్డాన్ మీదుగా ఆఫ్రికా, ఈజిప్ట్, యూరప్‌లోని గ్రీస్ వరకూ సాగింది. ఆ తరువాత ఫ్రాన్స్ మీదుగా యూకే అట్లాంటిక్ సముద్రం దాటి కెనడా, అమెరికా చేరుకున్నా. పసిఫిక్ మహా సముద్రం దాటి న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, బంగ్లాదేశ్ మీదుగా భారత్‌కు వచ్చాక మళ్లీ ఉద్యోగ జీవితంలో నిమగ్నమయ్యాను. ఈ క్రమంలోనే మా అమ్మ కుసుమ దయాల్ ఐదుగురి సంతానాన్ని పెంచి పోషించేందుకు చేసిన త్యాగం, పడిన కష్టాలు గుర్తుకువచ్చాయి. అమ్మ లాంటి ఎంతోమంది మాతృమూర్తుల గురించి ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటేషన్‌కు శ్రీకారం చుట్టాను.

దేశదేశాల్లోని మహిళల జీవితాలతో...

195 దేశాల్లోని విభిన్న రాష్ట్రాలు, జాతులు, కులాలు, మతాలు, వర్గాలకు చెందిన పది లక్షల మంది మహిళల జీవితాలను ఆవిష్కరించడమే 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' డాక్యుమెంటరీ ప్రధాన ఉద్దేశం. ఉన్నత స్థాయి నుంచి కూలి పనులు చేసుకునే మహిళల వరకు అందరి జీవితాలకు సంబంధించిన కీలక ఘట్టాలు అందులో ఉంటాయి. ఇప్పటివరకూ ఇలా ఇన్ని దేశాల మహిళల ఫొటోగ్రఫీలతో కూడిన డాక్యుమెంటు ఎవరూ చేయలేదు. అందుకే నేను ఈ మహత్తర కార్యం చేపట్టాలని అనుకున్నాను.

మహిళా దినోత్సవంనాడు...

'మిలియన్ అమేజింగ్ ఉమెన్స్' డాక్యుమెంటేషన్ పూర్తికావడానికి పది నుంచి పన్నెండేళ్ల సమయం పడుతుందని అంచనా. గత నెల, అంటే మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుజరాత్‌లోని బరోడా నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాను. ఇందులో తొలి పోర్ట్రైట్ ఫొటో బరోడా రాజమాత సుభాంగిని రాజేది. బ్రిటిష్ రాణి కంటే అతిపెద్ద కోటలో ఉండే ఆమెకు సంబంధించిన ఫొటోను తీయడం ద్వారా డాక్యుమెంటేషన్ ప్రారంభమైంది. ఇప్పటివరకూ 400 మందికిపైగా మహిళల ఫొటోలు, వివరాలు సేకరించాను. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన మహిళలపై డాక్యుమెంటేషన్ సాగుతోంది. ప్రస్తుతం ఉత్తర భారత్‌లోని పలు రాష్ట్రాల మహిళలను కెమెరాలో బంధించే పనిలో ఉన్నాను. ఇప్పటివరకు సంప్రతించినవారిలో రోజు కూలీలు, గిరిజన మహిళలు, సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఉన్నారు. అన్నీ కలిపి 'మిలియన్ అమేజింగ్ ఉమెన్' వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాను. కొన్ని వీడియోలు కూడా చిత్రీకరిస్తున్నాను. ప్రతి మహిళ వెనుక ఒక విజయ గాథ ఉంటుంది. దాన్ని ఈ ప్రపంచానికి చెప్పడమే నా ఉద్దేశం. పది లక్షలమంది మహిళలకు సంబంధించిన డాక్యుమెంటేషన్ అంటే సాధారణ విషయం కాదు. ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. అందుకు సిద్ధమయ్యే ఈ అద్భుత ప్రాజెక్ట్‌ను చేపట్టాను."

- బూటు శ్రీనివాసరావు, విశాఖపట్నం

శ్రామికులే దేశానికి వెన్నెముక

శ్రీకాకుళం లీగల్, మే 3(ఆంధ్రజ్యోతి): శ్రామికులే దేశానికి వెన్నెముక అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శ్రీధర్ అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో శనివారం కార్మికులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అసంఘటిత రంగ కార్మికులకు అవసరమై చట్టాలు, ప్రభుత్వ పథకాలు, అవసరమైన న్యాయ సలహాలను వివరించారు. అనంతరం జిల్లా కారాగారాన్ని పరిశీలించి, నిందితులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ అజయ్ కార్తికేయ, న్యాయవాదుల బృందం, కార్మికులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి


గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

ముగిసిన తారకనామ యజ్ఞం

కవిటి, మే 3(ఆంధ్రజ్యోతి): చిన్నకర్రివానిపాలెం గ్రామంలో ఐదు రోజులుగా కొనసాగిన తారకనామ యజ్ఞం శనివారం పూర్ణాహుతితో ముగిసింది. కాశీవిశ్వనాథస్వామికి రుద్రాభిషేకం, తారకనామయజ్ఞం, సింహద్వార ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజు పూర్ణ కలశాలతో మహిళలు ఊరేగింపు చేపట్టిన అనంతరం సముద్రంలో నిమజ్జనం చేపట్టారు. ఐదురోజుల పాటు నిర్విరామంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

రూ16.50కోట్లతో వంతెనల నిర్మాణం

ఇచ్ఛాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం బూర్జుపాడు, డొంకూరు గ్రామాల్లో రూ.16.50 కోట్లతో నిర్మించనున్న రెండు వంతెనలకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, నాయకులు దక్కత ఢిల్లీరావు, దక్కత శ్రీను, నందికి జాని, పద్మనాభం, కామేష్, సహదేవ్‌రెడ్డి, దున్న లోకేష్, పీఐఏ అధికారులు డీఈ జి.రవికుమార్ ఈఈ ఎస్.రామకృష్ణ, జేఈ ధనుంజయ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మీనాక్షి ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స


శస్త్ర చికిత్స చేసి బయటకు తీసిన స్టీల్‌గ్లాస్ ముక్క

అరసవిల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని మీనాక్షి ఆసుపత్రిలో అరుదైన, అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ గొండు గంగాధరరావు విజయవంతంగా నిర్వహించారు. గత నెల 22వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో 18 ఏళ్ల యువకుడు స్నేహితులతో సరదాగా బాణాసంచా స్టీల్ గ్లాస్‌లో పెట్టి పేల్చగా, ఆ స్టీల్ గ్లాస్ పగిలి ముక్క అతడి పొట్ట భాగాన్ని కోసింది. దీంతో దగ్గరలోని క్లినిక్‌లో కుట్లు వేయించుకున్నాడు. కానీ కడుపునొప్పి, కడుపు ఉబ్బరం ఎక్కువ కావడంతో ఆ యువకుడు అదేరోజు సాయంత్రం మీనాక్షి ఆసుపత్రి వైద్యులను సంప్రదించాడు. ఆసుపత్రికి వచ్చినప్పుడు బీపీ చాలా తక్కువగా ఉండి, రక్తహీనత గమనించి పరీక్షలు నిర్వహించగా పెద్ద పేగులో స్టీల్ గ్లాస్ ముక్క ఉన్నట్లు గుర్తించారు. పెద్ద పేగుని అనేక చోట్ల చీల్చి సుమారు 3.5 లీటర్ల రక్తస్రావానికి కారణమైందని తేలింది. అలాగే పెద్ద పేగుని తొలగించకుండా సంరక్షించడం వలన అతడికి భవిష్యత్తులో ఎటువంటి దీర్ఘకాలిక సమస్యలు ఉండవు. ఈ ఆపరేషన్‌లో మత్తు వైద్యుడు డాక్టర్ ప్రసాద్, మీనాక్షి ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది సహకరించారు.

ఎస్సీ వర్గీకరణతో అన్యాయం


మానవహారంగా రెల్లి సంక్షేమ సంఘ ప్రతినిధులు

సరుబుజ్జిలి, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకొచ్చిన దళిత వర్గీకరణ అసంబద్ధంగా ఉందని రాష్ట్ర రెల్లికుల సంక్షేమ సేవా సంఘం నాయకుడు గొల్లపల్లి సురేష్ తెలిపారు. శనివారం మూలసవలాపురం గ్రామం నుంచి సరుబుజ్జిలి వరకు రాష్ట్ర రెల్లికులాల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా రెల్లి కులస్థుల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గొల్లపల్లి ఎర్రయ్య, మోహన్‌రావు, రామారావు, అర్జున్, సిరిపల్లి శ్రీను, జగదీష్, గణపతి పాల్గొన్నారు.

నవధాన్యాలు సాగు చేయాలి

సరుబుజ్జిలి, మే 3(ఆంధ్రజ్యోతి): వరి పంట ఎదలో నవధాన్యాలు సాగు చేయడం వల్ల చాలా ప్రయోజనకంగా ఉంటాయని ఏవో బొడ్డేపల్లి పద్మనాభం తెలిపారు. మండలంలోని రావివలస గ్రామంలో కొత్తూరు డివిజన్ ఎంటీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో వరి పంటల ఎదలో నవధాన్యాలు సాగు విధానంపై అవగాహన కల్పించారు. జీలుగు, కట్టెజనుం, పిల్లి పెసర పంటలు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో రాము, యూనిట్ ఇన్‌చార్జి లలిత, ఈశ్వరరావు, తిరుపతిరావు, సుమ, పూర్ణ పాల్గొన్నారు.

పట్టుకునేలోపే తప్పించుకుంది..

- కొండల వైపు వెళ్లిపోయిన జింక

ఇచ్ఛాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): రత్తకన్న కొండల నుంచి దారి తప్పి ఊర్లోకి వచ్చిన ఓ జింకను అధికారులు పట్టుకొనేందుకు ప్రయత్నించారు. అయితే, అది వారి నుంచి తప్పించుకొని పారిపోయింది. శుక్రవారం రాత్రి కొండల నుంచి తప్పించుకొని వచ్చిన జింక బంగ్లారోడ్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ బంగ్లాలో దాక్కుంది. శనివారం ఉదయం అక్కడ నుంచి తిరిగి కొండల వైపు వెళ్లే క్రమంలో పరుగులు తీస్తూ మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంది. దీంతో సెక్యూరిటీ మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చిన కమిషనర్ కార్యాలయం గేట్లు మూసివేసి తాళాలు వేశారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండు గంటల తరువాత వచ్చిన అధికారులు జింకను పట్టుకొనే ప్రయత్నం చేశారు. దీంతో జింక పరుగులు తీసి మరలా కొండల వైపు వెళ్లిపోయింది.

తిట్ల దండకం.. గందరగోళం

- తెలికిపెంట పంచాయతీ నిధులపై విచారణ.. ఇరువర్గాల ఘర్షణ
- వెనుదిరిగిన అధికారులు

సరుబుజ్జిలి, మే 3(ఆంధ్రజ్యోతి): తెలికిపెంట పంచాయతీ నిధుల దుర్వినియోగంపై శనివారం నిర్వహించిన విచారణ సభ రసాభాసగా మారింది. ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. ఒకరిపై ఒకరు తిట్ల దండకంతో గందరగోళం నెలకొంది. తెలికిపెంట పంచా యతీలో ఆరో అంశం నుంచి 11 అంశం వరకు ఖర్చు చేసిన మెటీరియల్‌కు చెందిన రూ2.70లక్షలు నిధులు దుర్వినియోగం అయినట్టు ఈ ఏడాది జనవరి 6న కలెక్టర్ గ్రీవెన్స్‌లో పర్వతాలపేట గ్రామానికి చెందిన బెవర మల్లేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. దీనిపై అదే నెల 31న ఈవోపీఆర్‌డీ బొడ్డేపల్లి రామారావు పంచాయ తీలో విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. నివేదిక ప్రకారం డీఎల్‌పీవో ఐవీ రమణ పూర్తిస్థాయి విచారణ కు గ్రామానికి వచ్చారు. గ్రామ సచివాలయంలో డీఎల్‌పీవోతో పాటు ఈవోపీఆర్‌డీ రామారావు, స్థానిక సర్పంచ్ నందివాడ రాజ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది విచారణ నిర్వహించేందుకు సిద్ధమవుతుండగా రెండు వర్గాలు ఘర్షణకు దిగాయి. వ్యక్తిగత దూషణలు, తిట్ల దండకంతో సభలో గందరగోళం సృష్టించారు. ఒకానొక దశలో ఇరువర్గాలు కొట్లాడుకొనే పరిస్థితులు కూడా ఉత్పన్నమయ్యాయి. దీంతో అధికారులు తలో దిక్కుకు పరుగులు తీశారు. ఇరువర్గాలు సహకరిస్తేనే విచారణ నిర్వహిస్తామని, వ్యక్తిగత దూషణలకు పోయి భయ భ్రాంతులకు గురిచేస్తే ఏమీ చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. దీంతో గ్రామస్థులు కూడా సచివాలయం నుంచి బయటకు వచ్చేశారు. అధికారులు చేసేది లేక విచారణ పూర్తి చేయకుండానే వెళ్లిపోయారు. దీనిపై డీఎల్‌పీవో రమణ వివరణ కోరగా.. 'విచారణ సమయంలో రెండు వర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. దీనివల్ల విచారణ పూర్తిస్థాయిలో జరగలేదు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.' అని తెలిపారు.


విచారణ మధ్యలో ఇరువర్గాల వాదనలు

అలరించిన సంగీత విభావరి



గీతాలాపన చేస్తున్న గాయకులు

శ్రీకాకుళం కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోహి సంగీత కళాశాల ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో శాస్త్రీయ, భక్తి, సినీ సంగీత విభావరి అలరించింది. ఈ సంగీత విభావరిలో భాస్కరరావు, ఈశ్వరరావు, వాణిప్రియ, సుధన్వ, జ్యోత్స్న, ఉషారాణి, సుమిత్ర, ఇషా, నారాయణి తదితర గాయకులు భక్తి గీతాలతోపాటు ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, పి.సుశీలా జానకి పాడిన సినీ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో కీబోర్డ్, పెంకి నాగేశ్వరరావు, తబల సూర్యనారాయణ, పేడ్స్, బుజ్జిలు వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమంలో పెంకి నాగేశ్వరరావు, ఎల్.రామ లింగస్వామి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి జిడ్డు మోహన్‌రావు, భాస్కరభట్ల శ్రీరామ శర్మ, కాగాన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇటీవల రాష్ట్రస్థాయి కందుకూరి పురస్కారం అందుకున్న నటుడు మెట్ట పోలినాయుడును ఘనంగా సన్మానించారు.



ప్రమాదకరంగా..

గార, మే 3(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పీ రోడ్డు పక్కనే వమరవల్లి జంక్షన్ దగ్గరలో (కళింగపట్నం, శ్రీకాకుళం రోడ్డు పెద్ద ఎండిపోయిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఈ చెట్టు ఏ మాత్రం గాలి వేసినా కొమ్మలు విరిగిపడి కిందన ఉన్న విద్యుత్ లైన్లపై పడే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఈ చెట్టు తొలగింపు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరణ

ఆమదాలవలస, మే 3(ఆంధ్రజ్యోతి): చీమలవలస కాలనీ కట్టాచార్యులపేట దండేవలస, చింతలపేట తదితర గ్రామాలకు ఎట్టకేలకు విద్యుత్ పునరుద్ధరణ జరిగింది. గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులు కురిసిన వర్షానికి విద్యుత్ తీగలపై చెట్లు పడి అదే రోజు రాత్రి గ్రామంలో విదుత్ సరఫరా నిలిచిపోయింది. గురువారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు గ్రా మంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రు. ఒకవైపు విద్యుత్ సరఫరా లేక మరోవైపు కాలువల్లో మురుగునీరు నిల్వ వల్ల దోమలు విజృంభనతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని పలువురు గ్రామస్థులు వాపోయారు.

నిరుద్యోగులను మోసగిస్తున్న ప్రభుత్వాలు


జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అరసవల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం, అలాగే 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నారని భారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్ ధ్వజమెత్తారు. జెండాను ఆవిష్కరించి ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం స్థానిక క్రాంతి భవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో యువత హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న సంస్థ ఏఐవైఎఫ్ అని పేర్కొన్నారు. ఒకవైపు యువతను నిర్లక్ష్యం చేస్తూ మరోవైపు అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలైనా సరే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.38లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న మాటను మరిచిపోయారన్నారు. నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు యువత సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యువతకులతో తీవ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్, వేణు, మధు, రమేష్, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి



వజ్రపుకొత్తూరులో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు, మే 3(ఆంధ్రజ్యోతి): జమ్ము-కశ్మీర్ రాష్ట్రం పహల్గాం లో ముష్కరుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు వజ్రపుకొత్తూరులో శనివారం నివాళి అర్పించారు. కొవ్వొత్తులు పట్టుకుని శాంతిర్యాలీ చేపట్టా రు. ముష్కరులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శశిభూషణ్, మండల ఉపాధ్యక్షుడు ఎ.ఉమామహేశ్వరరావు, గ్రామస్థులు, చిన్నారులుల పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్యుల జయంత్యుత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): ఉపనిషన్మందిరంలో ఆదిశంకరాచార్యులు జయంతోత్సవాలు సందర్భంగా శనివారం ఆధ్యాత్మికవేత్త శ్రీకూర్మం దేవస్థానం స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు ఆధ్వర్యంలో శ్రీభగవత్ రామానుజులు విశిష్టాద్వైతం నిర్వహించారు. ఆదిశంకరాచార్యులు రామానుజుల గొప్పతనం, ఆధ్యాత్మిక బావనలు గురించి తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో హనుమత్ ఆధ్యాత్మిక కేంద్ర వ్యవస్థాపకులు అన్నదానం చిదంబర శాస్త్రి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటే మనశ్శాంతి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గుమ్మా నగేష్, వి.కామేశ్వరరావు, బాబూరావు, పతంజలి శాస్త్రి, డాక్టర్ కోమలరావు, నిష్టల నరసింహమూర్తి, బలివాడ మల్లేశ్వరరావు, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

కంచిలి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు నిధులు మంజూరు చేసి సహకరించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు కోరారు. ఎమ్మెల్యే అశోక్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన్ని కలిసి వినతి పత్రం అందజేశారు.

- సోంపేట, మే 3(ఆంధ్రజ్యోతి): రామయ్యపట్నం నుంచి బారువ వెళ్లేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ సభ్యులు మత్స్యకార నాయకులు నిట్టగోపాల్ కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయిడుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు.

ప్రాజెక్టులు పూర్తి చేయాలి

కంచిలి, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని రైతు సంఘం జిల్లాకార్యదర్శి మోహన్‌రావు, కౌలు రైతు సంఘం కార్యదర్శి వెలమల రమణ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాత శనివారం బూరగాం చేరుకుంది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. మండలంలోని ప్రధాన సాగునీటి వనరులు అభివృద్ధి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని, పైడిగాం చాలెన్‌కు సంబంధించిన ప్రధాన కాలువలు మరమ్మతులు చేపట్టి రైతాంగానికి సాగునీరందించాలన్నారు. కార్యక్రమంలో కె.ఢిల్లీరావు, బి.భైరి, చిన్నయ్య, భాస్కరరావు, సూరయ్య, కప్ప గోపి, లక్ష్మీనారాయణ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులపై దృష్టి సారించాలి

రణస్థలం, మే 3(ఆంధ్రజ్యోతి): తీరప్రాంతం వెంబడి కొత్త వ్యక్తులు సంచరిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు తక్షణమే సమాచారం ఇవ్వాలని కళింగపట్నం సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణ అన్నారు. శనివారం జీరుపాలెం, కొత్తముక్కాం గ్రామాల్లో మత్స్యకారులకు అవగాహన కల్పించారు. చేపల వేటకు వెళ్లే సమయంలో మత్స్య కారులు తీసుకోవల్సిన జాగ్రత్తల కోసం వివరించారు. టెర్రరిస్టులు, ఉగ్రవాదులు సముద్రం మీదగా వచ్చే అవకాశం ఉందని, కొత్త ముఖాలు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

8 నుంచి క్రికెట్ టోర్నమెంట్

సరుబుజ్జిలి, మే 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి పురుషోత్తపురంలో గ్రామంలో కిల్లి అప్పలనాయుడు మెమోరియల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శనివారం ప్రకటించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, బెస్ట్‌బౌలర్, బ్యాట్స్‌మెన్, మ్యాన్‌ఆఫ్ దిసిరిస్ ఉంటాయన్నారు. ఎం ట్రీ ఫీజు రూ.1000 చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 901418463, 9573896564 నెంబర్లకు సం ప్రదించాలన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం

ఇచ్ఛాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలం బాలకృష్ణాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రధాకృష్ణ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వేడుకగా జరుగుతు న్నాయి. శనివారం ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పక్షులకు తాగునీరందించండి

శ్రీకాకుళం కల్చరల్, మే 3(ఆంధ్రజ్యోతి): హడ్కో కాలనీ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో బాలకథా నిలయం అధ్యక్షుడు ఉమామహేష్ నిర్వహణలో విద్యార్థులకు మానవత విలువలు నేర్పుతూ వేసవిలో మూగజీవాలకు దాహం వేస్తుంది. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద డాబాలు పైనా, చెట్ల పైనా పక్షులకు తాగునీరు ఉంచి వాటి దాహం తీర్చి మానవత చాటుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పక్షులు తాగునీరు తాగుతున్న బ్రోచర్స్ ప్లకార్డ్సను ప్రదర్శించారు. అదేవిధంగా విద్యార్థులకు నీతి కథలు, పద్యాలు చెప్పించారు. ఈ కార్యక్రమంలో అనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సాయం

కవిటి, మే 3(ఆంధ్రజ్యోతి): కవిటి గ్రామానికి చెందిన పీఎం ఢిల్లేశ్వరి పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి ఉన్నత విద్యాభ్యాసం కోసం చింతామణి సొండికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.రామారావు ఆర్థిక సహకారాన్ని అందించారు. శనివారం గ్రామస్థులతో కలిసి ఢిల్లేశ్వరికి రూ.పది వేలు అందించారు. కార్యక్రమంలో పి.లక్ష్మణమూర్తి, పి.చంద్రశేఖర్, టి.మోహనరావు, ప్రసాద్, జి.రామారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ఆమదాలవలస, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు కలగనుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని చేపేసపేట యూనిట్‌ను ఆయన సందర్శించారు. రైతులు వ్యవసాయంలో పంటల పెట్టుబడులు తగ్గించుకొని అధిక దిగుబడులు వచ్చేలా ప్రకృతి వ్యవసాయంలో చేయాల్సిన పద్ధతులు, దిగుబడులు పొందడానికి అవసరమైన మేలైన యాజమాన్య పద్ధతులు గురించి క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అతి వేగానికి నిండు ప్రాణం బలి

● మరొకరికి తీవ్ర గాయాలు


అడపా శ్రీను(ఫైల్)

ఎచ్చెర్ల, మే 3(ఆంధ్రజ్యోతి): జరజాం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ వి.సందీప్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. రణస్థలం మండలం వేల్పురాయి గ్రామానికి చెందిన అడపా శ్రీను, బాలి సింహాచలం ద్విచక్రవాహనంపై శ్రీకాకుళం వైపు వెళ్తుండగా.. ముందు వెళ్తున్న వ్యాన్‌ను ఓవర్ టేక్ చేయబోయి, ఆగి ఉన్న కారును బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో రోడ్డుపై పడిన ఈ ఇద్దర్నీ కొంతదూరం వ్యాన్ లాక్కొని వెళ్లింది. కాగా, వ్యాన్ డ్రైవర్ ప్రమాద స్థలం వద్ద ఆగకుండానే వెళ్లిపోయాడు. గాయపడిన వీరిద్దర్నీ శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించగా... చికిత్స పొందుతూ అడపా శ్రీను మృతిచెందాడు. మృతునికి భార్య సత్యవతి, కుమా రులు హేమంత్, నవీన్‌లు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

శ్రీకాకుళం రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ వృద్ధుడు మృతి చెందాడు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కళ్లేపల్లి గ్రామానికి చెందిన కొయ్య తాతారావు(65) శనివారం జీడి తోటలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న ఉపాధి పథకం కూలీలు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మద్యం అలవాటుతోపాటు అప్పులు బాధలు భరించలేక తాతారావు ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం. భార్య పార్వతి నుంచి పోలీసులు వివరాలు సేకరించారు. శ్రీకాకుళం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్సు అందజేత

అరసవల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని పలాసకు చెందిన ధర్మరాజు కుటుంబ సమేతంగా శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ క్రమంలో తన పర్సును పోగొట్టుకున్న విషయం గుర్తించాడు. ఆలయ సిబ్బందికి ఈ విషయమై సమాచారం అందజేశాడు. అయితే ఈ పర్సు ఒక భక్తుడికి దొరకడంతో దానిని ఆలయ సెక్యూరిటీకి అందజేశారు. రూ.5 వేలు, ఏటీఎం కార్డులతో ఉన్న పర్సును సదరు భక్తునికి అందజేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

పాతపట్నం, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేగేటు సమీపంలో కాకి తోట వద్ద గుణుపూర్- పూరీ వెళ్లే రైలు ఢీకొని బోయిన కామేశ్వరరావు (57) శనివారం మృతి చెందినట్లు పలాస జీఆర్‌పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతుడు పాతపట్నం శివశంకర్‌కాలనీలో ఒకటో వీధిలో నివాసం ఉంటున్నాడు. ఆలాంధ్రరోడ్ కూడలిలో చికెన్ పకోడీ తదితర వంటకాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు ఉన్నారు.

నీలమణిదుర్గ ఆలయ మాజీ చైర్మన్ 'నూలు' మృతి

పాతపట్నం, మే 3(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నీలమణిదుర్గ ఆలయ మాజీ చైర్మన్ నూలు ఈశ్వరరావు(58) శనివారం మృతిచెందారు. ఈయన వైసీపీ హయాంలో ఆలయ చైర్మన్‌గా వ్యవహరించారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. ఈశ్వరరావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

లారీ బోల్తా: ఇద్దరికి గాయాలు

నందిగాం, మే 3(ఆంధ్రజ్యోతి): ఆకులరఘునాథపురం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన లారీ బోల్తా ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కటక్ నుంచి విశాఖ జిల్లా పెందుర్తి రైల్వే బోల్టు, నట్లుతో వెళ్తున్న లారీ ఆకుల రఘునాథపురానికి వచ్చే సరికి అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ అజ్మర్, క్లీనర్ పజానీలకు గాయాలయ్యాయి. పజానీకి రెండు కాళ్లు విరిగిపోయాయి. వీరిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. క్లీనర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

● ముగ్గురిపై కేసు నమోదు

నందిగాం, మే 3(ఆంధ్రజ్యోతి): తన కన్నవారింటికి భర్తతో పాటు అత్త, బావ వచ్చి దాడి చేశారని రౌతుపురం గ్రామానికి చెందిన బెవర పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పద్మావతికి అదే గ్రామానికి చెందిన నందేసుతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. నందేసు మద్యం తాగి తరచూ వేధిస్తుండడంతో పద్మావతి పిల్లలతో కలిసి కన్నవారింటికి వచ్చేసింది. శనివారం పద్మావతి కన్నవారింటికి భర్త నందేసుతో పాటు అత్త పున్నాలమ్మ, బావ లక్ష్మీనారాయణ వచ్చి దాడి చేశారు. అడ్డుకున్న చెల్లెలు తలగాన ఉమపై కూడా దాడిచేసి చంపుతానని బెదిరించారని భార్య ఆ ఫిర్యాదు చేశారు. గాయపడిన పద్మావతి, ఉమ టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాలు సమాచారాన్ని పోలీసులకు అందించడంతో ఎస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రగతి నివేదికలను తయారు చేయాలి

నరసన్నపేట, మే 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, పారిశ్రామిక తదితర రంగాల ప్రగతి, ప్రజల జీవన ప్రమాణాల నివేదికలను అన్నిశాఖ అధికారులు సమన్వయంతో తయారు చే యాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ప్రసన్నలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు, ఇతర శాఖల అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలాల వారీగా ఏయే రంగాలపై ప్రజలు ఆధారపడుతున్నారన్న వివరాలను ఈనెల 15వ తేదీలోగా తయారు చేయాలన్నారు. ఎంపీడీవో మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు



పోలాకి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రియాగ్రహారం పంచాయతీ కాకినాడపేటలో రామాలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం రెండో రోజు కొనసాగాయి. ఇందులో భాగంగా క్షేత్రపాలక, నవగ్రహ సర్వతాభద్రమండల ఆవాహనలు, వాస్తు, యోగిని పంచశయ్యాదివాసం, దిగ్బలి ప్రధానం తదితర కార్యక్రమాలు చేపట్టారు. రామాలయ నిర్మాణానికి స్థలం దానం చేసిన చింతాడ శ్రీనివాసరావు, రామాంజనేయులను ఆలయ కమిటీ సభ్యులు సత్క రించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లావేటి కృష్ణ, తిర్లంగి విశ్వనాథం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

నందిగాం, మే 3(ఆంధ్రజ్యోతి): నందిగాం షిర్డీసాయిబాబా ధ్యాన మందిరం ఆరో వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. అర్చకులు రమేష్ శర్మ, వంశీ ఆధ్వర్యంలో షిర్డీసాయి, గణపతి, దత్తాత్రేయ స్వామి విగ్రహాలకు అభిషేకం చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

లక్ష్యానికి తూట్లు

● నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రాలు
● రోడ్ల పక్కనే చెత్త కుప్పలు



అంబుగాంలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం (ఇన్‌సెట్‌లో) రోడ్డు పక్కనే చెత్త వేస్తున్న దృశ్యం

హరిపురం, మే 3(ఆంధ్రజ్యోతి): గ్రామాలను ఆరోగ్యకరంగా ఉంచడంతో పాటు పంచాయతీలకు అదనపు ఆదాయం పెంపొందించేందుకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాలు లక్ష్యానికి దూరంగా పయనిస్తున్నాయి. ఇంటింటి నుంచి చెత్తను సేకరించి దానిని ఈ కేంద్రాలకు తరలించి అక్కడ ఎరువుల తయారీ చేపట్టాలన్నది లక్ష్యం. ఈ ఎరువులను తిరిగి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తుంది. లక్ష్యం మంచిదే అయినా క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడా వినియోగించడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 812 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను నిర్మాణాలు చేపట్టగా సుమారు 580 పూర్తయ్యాయి. వీటి నిర్మాణాలకు ఒక్కో కేంద్రానికి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వ్యయమైంది. అయితే ప్రభుత్వ నిర్దేశం మేరకు ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయా, ఎరువులు తయారీ అవుతున్నాయా అంటే అనుమానమే. తరచూ అధికారులు తనిఖీలు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశిస్తున్నా ఎక్కడా పాటించిన సందర్భాలు లేవనే చెప్పాలి. దీంతో ఈ కేంద్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. గ్రామాల నుంచి చెత్తను సేకరించి రోడ్ల పక్కనే పడేయడంతో మరలా దుర్గంధం వెదజల్లుతోందన్న స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని పంచాయతీల్లో ఈ కేంద్రాల సమీపంలోనే పారవేస్తున్నారు. మందస మండలంలో సైతం ఇదే దుస్థితి నెలకొంది. అంబుగాం, బాలిగాం, హరిపురం, మందస తదితర పంచా యతీల్లో ఈ కేంద్రాలను వినియోగించిన సందర్భం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగించేలా ఆదేశాలివ్వాలని ఆయా పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

ఈశ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి నిర్మల

టెక్కలి, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రతి కార్మికుడు ఈ శ్రమ్ కార్డు కలిగి ఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల అన్నారు. శనివారం అసంఘటిత కార్మికులకు న్యాయ సేవల పథకం-2015 అనే అంశం పై మండల మహిళా సమాఖ్య కార్యాలయం, శ్రీలక్ష్మి జీడి పప్పు పరిశ్రమలో అవగాహన, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. ఈశ్రమ్ పోర్టల్‌లో వారి వివరాలు విధిగా నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, బీమా పొందవచ్చన్నారు. న్యాయ సేవాధికార సంస్థ అసంఘటిత కార్మికులకు అందిస్తున్న న్యాయ సేవలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ పట్నాయక్, న్యాయవాదులు పొట్నూరు ఆనందరావు, పైడి సాయిరాజ్, మండల మహి ళా సమాఖ్య కార్యాలయ ఏపీవో ప్రసాదరావు, పరిశ్రమ యజమాని అనిల్‌కుమార్, టెక్కలి కార్మిక శాఖ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోండి

పలాసరూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలని, దీని నిమిత్తం టోల్‌ఫ్రీ 15100 నెంబరులో సంప్రదించాలని పలాస మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి యు.మాధురి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో అంతర్జాతీయ కార్మిక వారోత్సవాల్లో భాగంగా శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. అసంఘటిత కార్మికులు వారు పని చేసే చోట రూ.110


పలాస రూరల్: మాట్లాడుతున్న న్యాయాధికారి మాధురి

చెల్లించి కార్డు తీసుకుంటే ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.వసంత్ కుమార్, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బీకేఆర్ పట్నాయక్, కార్యదర్శి జీఎంఎస్ అనిల్‌రాజ్, కోత రజనీ కుమార్, ఎస్ఐ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును పరిశీలించిన న్యాయాధికారి

నరసన్నపేట, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును నరసన్నపేట సివిల్ న్యాయాధికారి బి.వాణి శనివారం పరిశీలించారు. సబ్‌జైలులో ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఖైదీలకు సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.


నరసన్నపేట: రికార్డులను పరిశీలిస్తున్న న్యాయాధికారి వాణి

తాళభద్ర రైల్వే ఫ్లై ఓవర్‌కు గ్రీన్‌సిగ్నల్

● రైల్వే నిధులతో నిర్మించేందుకు అంగీకారం


రైల్వే బ్రిడ్జి మంజూరు పత్రాన్ని చూపిస్తున్న టీడీపీ నాయకులు

పలాస, మే 3(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 5వ వార్డు తాళభద్ర రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ వివరాలిలా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎమ్మెల్యే గౌతు శిరీష ఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి ఫ్లై ఓవర్ సమస్యను వివరించారు. ఈ నేపథ్యంలో రూ.49 లక్షలు మంజూరు చేస్తూ ఆదేశించారు. అయితే తాళభద్ర రైల్వేగేటుపై సందిగ్ధత నెలకొంది. తాళభద్ర వద్ద రైల్వే గేటు నిర్మిం చాలా, వద్దా అనే విషయమై రైల్వేశాఖ సమగ్ర సర్వే చేపట్టింది. మట్టి నమూనాలు సేకరించి రైల్వే ఇంజనీరింగ్ శాఖకు అప్పగించారు. దేశవ్యాప్తంగా ఎల్‌సీ గేట్లు ఉన్న స్థానంలో ఫ్లై ఓవర్‌లు, అండర్ పాసేజీ లు నిర్మించాలని ఆదేశాలు రావడం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే శిరీష ఫిర్యాదు నేపథ్యంలో రైల్వేశాఖ స్పందిస్తూ.. తాళభద్ర వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి అనుమతులు మం జూరు చేసింది. ఈ మేరకు గతనెల 22న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయు డుకు ఈస్ట్ కోస్టు రైల్వే (భువనేశ్వర్) జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్ లేఖ అందించారు. పూర్తిగా రైల్వేశాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను స్థానిక టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు పత్రికలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాళభద్ర వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి రైల్వేశాఖ నిర్ణయించడం, దీనికి కృషి చేసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీషలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వల్ల వేలాది మంది ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వజ్రపుకొత్తూరు మండలంతో పాటు పలాస మండలం, మునిసిపాలిటీ ప్రజల రాకపోలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు.

టీడీపీకి కార్యకర్తలే ఆయుధం


మాట్లాడుతున్న సమన్వయకర్త వెంకన్నచౌదరి

పలాస, మే 3(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమైన ఆయుధమని పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి అన్నారు. సంస్థాగత ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పలాస నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల కష్టాల్లో పాలుపంచుకున్న వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యత, గుర్తింపు ఇవ్వడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు చౌదరి నారాయణమూర్తి(బాబ్జి), ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, నేతలు గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, సప్ప నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక రహదారి నిర్మాణం ప్రారంభం

ఎల్.ఎన్.పేట, మే 3(ఆంధ్రజ్యోతి): తురకపేట-దబ్బపాడు గ్రామాల మధ్య ఉన్న కడపల గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. గతనెల 29న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం పనుల సమయంలో రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు గాను సమీపంలో తాత్కా లిక రహదారి నిర్మాణం ప్రారంభించారు. మట్టిని వేసి చదును చేసే ప్రక్రియను యంత్రాల సాయంతో చేపట్టారు. ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణలో టిప్పర్లతో మట్టిని వేసి డోజర్‌తో చదును చేస్తున్నారు. రూ.67 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

పర్తియాత్రకు జీడిపప్పు ప్రసాదం


పుట్టపర్తికి తరలించేందుకు పలాస రైల్వే స్టేషన్‌లో సిద్ధంగా ఉంచిన జీడి పప్పు ప్యాకెట్లతో సత్యసాయి మందిర నిర్వాహకులు

పలాస, మే 3(ఆంధ్రజ్యోతి): సత్యసాయి పర్తియాత్ర సందర్భంగా స్థానిక సేవా సమితి ఆధ్వర్యంలో జీడిపప్పు, కిస్మిస్ 9 వేల ప్యాకెట్లను శనివారం పుట్టపర్తికి తరలించారు. యాత్రకు వచ్చే భక్తులకు వీటిని ప్రసాదంగా అందించనున్నామని ఈ కార్యక్రమ నిర్వాహకుడు, ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు తెలిపారు. 22 ఏళ్లుగా ఈ ప్రక్రియ నిర్వహి స్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఇప్పిలి తిరుమలరావు, ఉపాధ్యక్షుడు తాళాసు శ్రీనివాస్, మల్లా శరత్‌బాబు, జగదీష్ పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌కు మోక్షం


నర్సిపురం జంక్షన్ వద్ద బస్ షెల్టర్ పనులు జరుగుతున్న దృశ్యం

నందిగాం, మే 3(ఆంధ్రజ్యోతి): నర్సిపురం జంక్షన్ జాతీయ రహదారికి ఆనుకుని గతంలో అసంపూర్తిగా ఉన్న బస్ షెల్టర్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. 2012 లో అప్పటి కేంద్ర మంత్రి కృపారాణి ఎంపీ నిధులతో ప్రారంభించిన పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో ప్రజలు బస్సుల కోసం రోడ్లపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. గతనెల 11న బస్ షెల్టర్ నిర్మాణం విషయమై గ్రామస్థులు మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన వెంటనే స్పందించి పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో పనులను పునఃప్రారంభించారు. పనులు చకచకా జరుగు తుండడంతో స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

రీ సర్వే తెచ్చిన తంటా

(ఒకటో పేజీ తరువాయి)

సర్వేనంబర్లలో సబ్‌డివిజన్‌లు తీసేసి జాయింట్ ఎల్‌పీ నెంబరు ఇచ్చారు. దీంతో రికార్డుల్లో ఒకరిభూమి ఇంకొకరిపేరు మీద నమోదైపోయింది. జాయింట్ ఎల్‌పీ నెంబర్ల కారణంగా మ్యుటేషన్లు జరుగక 1-బీ, అడంగళ్‌లు రావడంలేదు. దీంతో బ్యాంకుల్లో వ్యవ సాయ రుణాలు తీసుకున్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవసరానికి భూములు విక్రయించుకోలేకపోతున్నారు. మ్యుటేషన్లు జరుగక రిజిస్ట్రేషన్‌లు చేసుకోలేకపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

శివారు భూములకు సాగునీరందించాలి


టెక్కలిలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

కాశీబుగ్గ/మందస/నందిగాం/టెక్కలి, మే 3(ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌ను పూర్తి చేసి శివారు భూములకు సాగునీరు, పలాస పట్టణానికి తాగునీరందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్‌రావు డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరుతూ ఈనెల 7న జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద చేపడుతున్న మహాధర్నా విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన జీపుజాతా బృందం శనివారం కాశీబుగ్గ, మందస, నందిగాం, టెక్కలిలో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్లు గడుస్తున్నా ఆఫ్‌షోర్ పూర్తి కాలేదని, త్యాగం చేసి రైతులు భూములిస్తే నిర్వాసితుల కాలనీలో మౌలిక వసతులు కల్పించలేదన్నారు. వంశధార ప్రాజెక్టు పూర్తిగా మరమ్మతులకు గురైందని, ఆధునికీకరణ పనులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కళింగదళ్, డబార్సింగి, దామోదరసాగరం ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రరావు, నేతలు నంబూరు షణ్ముఖరావు, ఈశ్వరరావు, అజయ్ కుమార్, లక్ష్మీ నారాయణ, ధర్మారావు, పోలాకి ప్రసాదరావు, వెలమల రమణ, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు సూర్యనారాయణ స్వామి కల్యాణం

టెక్కలి, మే 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత జాతీయరహదారి వద్ద ఉన్న సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఉష, ఛాయా పద్మినీ సమేత సూర్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎస్. రాజేశ్వరరావు, జోగారావు, నాగభూషణరావు తెలిపారు. వేద పండితుడు శతపతి దేవేంద్ర శర్మ ఆధ్వర్యంలో చేపడుతున్న కల్యాణంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రేపటి నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

పాతపట్నం, మే 3(ఆంధ్రజ్యోతి): ఆధార్ నమోదు స్పెషల్ డ్రైవ్‌ను సోమవారం నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.చంద్రకుమారి తెలిపారు. ఆరేళ్ల లోపు పిల్లలకు కొత్తగా నమోదుతో పాటు బయోమెట్రిక్ పెండింగ్‌లో ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలివిడతగా పాతపట్నం-1, బూరగాం, తెంబూరు సచివా లయాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.

కాలువలపై ఆక్రమణల తొలగింపు

పలాస, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మొగిలిపాడు, కేటీ రోడ్, ఇందిరాచౌక్, నర్సి పురం, కాశీబుగ్గ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో కాలువలపై ఉన్న ఆక్రమణలను శనివారం తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు మాట్లాడుతూ.. కాలువల పైకప్పులపై ఎటువంటి దుకాణాలు ఏర్పాటు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా స్పందించి కాలువలపై కట్టడాలు తీయాలన్నారు.

వర్షంతో ఉపశమనం

జలుమూరు, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం పడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఉదయమంతా భానుడి ధాటికి ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు ఒక్కసారి మేఘావృతమై కురిసిన వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో పరిపక్వ దశలో ఉన్న మామిడికి నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు.

ఉచిత సీట్లు ఇవ్వాల్సిందే

నరసన్నపేట, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాల్సిందేనని ఎంఈవోలు యు.శాంతారావు, పి.దాలినాయుడు అన్నారు. శనివారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. కొన్ని పాఠశాలలు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయకుండా జాప్యం చేయడం తగదన్నారు. తక్షణం డేటాను ఆన్‌లైన్ పూర్తి చేయాలన్నారు. సెలవుల్లో పాఠశాలలు తెరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హామీలను నెరవేర్చాలి

నరసన్నపేట, మే 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఎన్డీఏ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అఖిలభారత యువజన సమాఖ్య నాయకులు అరవింద్, సాంబశివ రాజు డిమాండ్ చేశారు. శనివారం సంఘం 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు క్రాంతి, వాసు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నవ్వండి.. నవ్వించండి

(ఒకటో పేజీ తరువాయి)

లాఫింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలని అభిప్రాయపడుతున్నారు. నవ్వడంతో మనలో శక్తి పుంజుకుంటుందని, ఇది ప్రతీ అవయవానికి ఒకవిధమైన వ్యాయామం అని తెలిపారు.

ప్రతి ఒక్కరూ నవ్వాలి..

ఆరోగ్యమే మహాభాగ్యం. అందుకు ప్రతిఒక్కరూ నవ్వాలి. ప్రపంచ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల మాధవ్ ద్వారా నేను మిమిక్రీ విద్యను నేర్చుకున్నా. ఉపాధ్యాయుడిగా పదవీవిరమణ పొందిన తరువాత లాఫింగ్ క్లబ్ అని ఏర్పాటు చేశా. వేసవి సెలవుల్లో నెల రోజుల పాటు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి పిల్లలకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తున్నాం.

-ఎల్.నందికేశ్వరరావు, మిమిక్రీ ఆర్టిస్ట్, శ్రీకాకుళం